# సిమెంట్ ధరలకు రెక్కలు?

**ఈ ఆర్థిక సంవత్సరం 4 శాతం వరకు విజృంభించనున్న రేట్లు**
**మార్కెట్‌లో 7.5 శాతం మేరకు పెరగనున్న డిమాండ్: క్రిసిల్ అంచనా**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2 నుంచి 4 శాతం (రూ.15-20) మేరకు పెరిగే వీలున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ, విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ తాజా రిపోర్టులో అంచనా వేసింది. అలాగే డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరగవచ్చని కూడా అన్నది. ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ హౌజింగ్ ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో 10 శాతం దాకా కేటాయింపులు పెరగడం, రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందన్న అంచనాలు సిమెంట్ వినియోగాన్ని, పరిశ్రమను ఉత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నది. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలు ఊపందుకుంటాయని కూడా క్రిసిల్ ఇంటిలిజెన్స్ అసోసియేట్ డైరెక్టర్ సచిదానంద్ చౌబె చెప్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ ఇండస్ట్రీలో వృద్ధిరేటు 4.5-5.5 శాతంగానే ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అధిక వృద్ధిరేట్లే ఇందుకు కారణమని చెప్తున్నారు.

**మౌలికమే దన్ను**

రోడ్ల నిర్మాణాలు ఈ ఆర్థిక సంవత్సరం పెద్ద ఎత్తున జరిగే వీలుండటం సిమెంట్ వినియోగపు అంచనాల్ని అమాంతం పెంచేస్తున్నాయని క్రిసిల్ అంటున్నది. రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కూడా జోరుగా జరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్‌కు గిరాకీ బాగా పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేస్తున్నది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ) వంటి పథకాలు సైతం సిమెంట్ ఇండస్ట్రీకి దన్నునిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మొత్తానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండే ఈసారి సిమెంట్ పరిశ్రమ ఆదాయానికి కీలకంగా మారనున్నాయి.

**పట్టణ డిమాండ్ అంతంతే**

దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిర్మాణ రంగం నిరాశాజనకంగా ఉండటం సిమెంట్ పరిశ్రమకు ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గృహ రుణాలపై వడ్డీరేట్లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం కొనుగోలుదారులను నిరుత్సాహపరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిర్మాణ వ్యయం కూడా కస్టమర్లను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని, దీంతో ఇప్పటికే నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, కొత్త ప్రాజెక్టులపై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపట్లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పడిపోవడం, మార్కెట్‌లో స్తబ్ధత నెలకొనడం పరిశ్రమకు ప్రతికూలమని అభిప్రాయపడుతున్నారు. అయితే హైదరాబాద్‌సహా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకొంటే సిమెంట్ ధరలు ఇంకా పెరిగే వీలుందన్న అంచనాలూ ఉన్నాయి.

# లక్ష రూపాయలు దాటిన పుత్తడి

**మరో రూ.1,800 పెరిగిన తులం ధర**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. తొలిసారిగా లక్ష రూపాయల మైలురాయిని అధిగమించి రికార్డు నెలకొల్పింది పుత్తడి. దేశీయ రాజధానిలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి లక్ష రూపాయల పైకి చేరుకున్నది. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు వచ్చేవారంలో అక్షయ తృతీయ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ధరలు భారీగా పెరుగుతున్నాయి. ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాల ఆర్థికంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం. దీంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్నది. సోమవారం ఇది రూ.99,800గా ఉన్నది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర రూ.22,650 లేదా 29 శాతం ఎగబాకింది. మరోవైపు, వెండి ధరలు నిలకడగా రూ.98,500 వద్ద స్థిరంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.3,000 ఎగబాకి రూ.1,01,350కి చేరుకున్నది. అంతకు ముందు ఇది రూ.98,350గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.2,750 అందుకొని రూ.92,900 పలికింది. కిలో వెండి రూ.1,11,000గా నమోదైంది.



**అక్షయ తృతీయకు డిమాండ్ అంతంతే**

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలతో సామాన్యుడితోపాటు సంపన్నవర్గాలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. ఈనెల 30న అక్షల తృతీయ సందర్భంగా కొనుగోళ్లు భారీగా తగ్గే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

**బంగారం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు**

- టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటుండటం
- వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం నెలకొనడం
- చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కేంద్రబ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం
- అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడటం

# ఆరో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై, ఏప్రిల్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 187.09 పాయింట్లు అందుకొని 79,595.59 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41.70 పాయింట్లు ఎగబాకి 24,167.25 వద్ద స్థిరపడింది. భారీగా లాభపడ్డ సూచీలకు ఐటీ, ఎనర్జీ రంగ షేర్లు బ్రేక్‌లు వేశాయని, అయినప్పటికీ రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ సూచీలు ఇచ్చిన దన్నుతో లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..మరోవైపు ఇండస్ఇండ్ బ్యాంక్ 4.88 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్సర్వ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.40 శాతం లాభపడగా, ఎఫ్‌ఎంసీజీ 1.87 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.43 శాతం, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభపడగా..టెక్నాలజీ, ఐటీ, పవర్, యుటిలిటీస్, టెలికం రంగ షేర్లు నష్టపోయాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రికార్డు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నది. మంగళవారం సంస్థ షేరు 2 శాతం లాభపడటంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. ఈ మైలురాయికి చేరుకున్న మూడో సంస్థ కూడా హెచ్‌డీఎఫ్‌సీ కావడం విశేషం. గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంక్ షేరు 11 శాతం లాభపడటంతో మార్కెట్ క్యాప్ రూ.1,50,289.64 కోట్లు పెరిగి రూ.15,01,289.37 కోట్లుగా నమోదైంది.

# సత్తా చాటిన తెలంగాణ తేజాలు

- సాయి శివానీకి 11వ ర్యాంకు
- కానిస్టేబుల్ కుమారుడికి 68వ ర్యాంకు
- టాప్-10లో తెలంగాణకు దక్కని చోటు
- 100లో 13 మంది తెలుగు విద్యార్థులు
- తెలుగు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపిక
- 1,009 మంది ఫలితాలు విడుదల



సాయిశివాని



జయసింహారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వెలువరించిన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలంగాణకు ర్యాంకుల పంట పండింది. రాష్ట్రానికి చెందిన ఎట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించింది. వరంగల్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన చింతకింది శ్రావణ్‌కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాయి చైతన్యజాదవ్ 68వ ర్యాంకుతో అదరగొట్టారు. అయితే టాప్-10లో ఒక్కరు కూడా తెలంగాణకు చెందిన వారు లేరు. ఈ సారి మొత్తం గా 1,009 మంది ఫలితాలను యూపీఎస్సీ విడుదల చేయగా, క్యాటగిరీవారీగా తీసుకుంటే జనరల్ 335, ఈడబ్ల్యూఎస్ 109, ఓబీసీ 318, ఎస్సీ 160, ఎస్టీ 87 క్యాటగిరీ అభ్యర్థులున్నారు. ఈ సారి తెలంగాణ, ఏపీ నుంచి సివి ల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారి సంఖ్య పెరిగింది. రెండు రాష్ట్రాల నుంచి 78 మంది ఎంపికైనట్టు లా ఎక్సలెన్స్ డైరెక్టర్ రాంబాబు పాలడుగు అంచనావేశారు. టాప్-100లో 13 మంది తెలుగు విద్యార్థులున్నట్టు విశ్లేషించారు.

**కోచింగ్ తీసుకోకుండా 11వ ర్యాంకు**

వరంగల్ శివనగర్‌కు చెందిన సాయిశివాని కోచింగ్ తీసుకోకుండానే, సొంత ప్రిపరేషన్‌లో, నిపుణుల మార్గదర్శనంలో ఏకంగా ఆలిండియా 11వ ర్యాంకు సాధించడం గమనార్హం.

**కానిస్టేబుల్ కొడుకు.. కలెక్టర్ కాబోతున్నడు**

నాన్న కానిస్టేబుల్. అమ్మ టీచర్. సివిల్స్ ప్రయత్నంలో ఐదు సార్లు విఫలమయ్యాడు. అయినా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. క్రమపద్ధతిలో హార్డ్‌వర్క్‌చేసి సక్సెస్ సాధించాడు సాయిచైతన్య జాదవ్. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని, 68వ ర్యాంకు వస్తుందని ఊహించలేదని సాయిచైతన్య తెలిపాడు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి స్టేట్ రెండో టాపర్(46వ ర్యాంక్)గా నిలిచాడు. నల్లమలకు చెందిన దళిత యువకుడు మొదటిసారే సత్తా చాటాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ వాసి సాయికిరణ్ 298వ ర్యాంక్ సాధించాడు. హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన హరిప్రసాద్ 255వ ర్యాంక్ సాధించాడు.

| పేరు | ర్యాంకు |
|---|---|
| ఎట్టబోయిన సాయి శివానీ | 11 |
| రావుల జయసింహారెడ్డి | 46 |
| చింతకింది శ్రావణ్ కుమార్‌రెడ్డి | 62 |
| సాయిచైతన్య జాదవ్ | 68 |
| కొలిపాక శ్రీకృష్ణ సాయి | 190 |
| కౌశిక్ నర్సింహ | 225 |
| పోతరాజు హరిప్రసాద్ | 255 |
| సాయికిరణ్ | 298 |
| రాపర్తి ప్రీతి | 451 |
| బానోతు నాగరాజు నాయక్ | 697 |
| తొగరపు సూర్యతేజ | 799 |
| గోకమల్ల ఆంజనేయులు | 934 |
| రామటెంకి సుధాకర్ | 949 |

# సివిల్స్ ఫలితాల్లో నారీశక్తి

- యూపీకి చెందిన శక్తి దూబేకు ఫస్ట్ ర్యాంకు
- టాప్-5లో ముగ్గురు మహిళలు
- టాప్-20లో ఏకంగా 11 మంది
- ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- 2024 ఫలితాల్లో నారీశక్తి ప్రతిబింబించింది. టాప్-5లో ముగ్గురు యువతులు ఉండగా, టాప్-20లో ఏకంగా 11 మంది చోటు దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబేను మొదటి ర్యాంకు వరించిం ది. హర్షితా గోయల్‌కు రెండో ర్యాంకు, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. డోంగ్రే అర్చిత్ పరాగ్‌కు మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్‌కు ఐదో ర్యాంకు లభించినట్టు యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ప్రథమ ర్యాంకర్ శక్తి దూబే యూపీలోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. రెండవ ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకాం పట్టభద్రురాలు. మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టభద్రుడు. నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు.

- పేరుకే సెంటర్ ప్రారంభించిన్రు
- మమ్మల్ని గోసపెట్టొద్దు
- వెంటనే వడ్లు కాంటా వేయండి
- గంభీరావుపేటలో రోడ్డుపై ధాన్యం సంచులతో రైతుల ధర్నా

# వడ్లు ఇంకెప్పుడు కొంటరు?

గంభీరావుపేట, ఏప్రిల్ 22: 'పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన్రు. నేటికీ ఒక్క క్వింటాల్ వడ్లు కూడా కొనలే. ఇంకెప్పుడు కొంటరు?' అంటూ గంభీరావుపేట రైతులు ప్రశ్నించారు. తమను గోసపెట్టవద్దని, వెంటనే వడ్ల కాంటా వేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గంభీరావుపేట మండల కేంద్రంలో రోడ్డుపై ధాన్యం సంచులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆరుగాలం కష్టపడి వడ్లు పండిస్తే కొనుగోళ్లలో అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. వారం క్రితం అధికారులు పేరుకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారని, వడ్లు కొనాలని అడిగితే అలాట్‌మెంట్ రాలేదని, ట్రాన్స్‌పోర్టుకు లారీలు లేవని చెప్పడం సిగ్గుచేటన్నారు. సోమవారం అలాట్‌మెంట్ వచ్చినా.. రైస్‌మిల్లు యజమానులు అష్టమి అని చెప్పి వడ్లు వద్దన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో 1,200 సంచులను కాంటా చేసి ఐదు రోజులు అవుతున్నా.. ట్రాన్స్‌పోర్టుకు లారీలు లేవని చెప్పడం సరికాదన్నారు. కాంటా వేసిన సంచులకు రక్షణ, తరుగు, వర్షానికి బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. గతంలో మాదిరిగా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రోడ్డుపై టెంట్లు వేసుకుని కూర్చొంటామని హెచ్చరించారు.



గంభీరావుపేటలో రోడ్డుపై ధాన్యం సంచులతో ధర్నా చేస్తున్న రైతులు

**కాంటా వేసి ఆరు రోజులైంది**



మాది గంభీరావుపేట. పదిహేను రోజుల క్రితం కేంద్రానికి వడ్లు తెచ్చిన. ఆరు రోజుల క్రితం నా వడ్లు 600 సంచులను కాంటా పెట్టిన్రు. వడ్లు కాంటా అయిన తర్వాత కూడా మిల్లుకు చేరేవరకు మాదే బాధ్యత అని చెప్పిన్రు. బస్తాలు నానకుండా కవర్లు కప్పి.. ఇక్కడే కాపలా ఉంటున్నం. లారీల సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలి. అధికారులు న్యాయం చేయాలి.- **చిలుక స్వామి, రైతు (గంభీరావుపేట)**



**రోడ్లపై టెంట్లు వేసి కూర్చొంటం**

గతంలో మాదిరిగా ప్రభుత్వం వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి. కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి పదిహేను రోజులు అవుతున్నది. మాలాంటి పేద రైతులను ఇబ్బందిపెడితే మా ఉసురుతగులుతది. అలాట్‌మెంట్, ట్రాన్స్‌పోర్ట్, గన్నీసంచుల కొరతను ప్రభుత్వం రైతుల మెడకు వేయవద్దు. అలాంటి పరిస్థితులు తీసుకువస్తే భార్యాపిల్లలతో కలిసి అందరం రోడ్లపైకి వచ్చి టెంట్లు వేసుకుని కూర్చొంటం.

**- గంట శ్రీనివాస్, రైతు (గంభీరావుపేట)**

# ఇంటర్ ఫలితాలు విడుదల

ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణతలో కరీంనగర్ జిల్లా ముందంజ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 22: తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యూకేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంతోపాటు ఒకేషనల్ ఫలితాలను ఏకకాలంలో విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో కరీంనగర్ జిల్లా ముందంజలో నిలిచింది. మొదటి సంవత్సరంలో కరీంనగర్ జిల్లా విద్యార్థులు 16,264 మంది పరీక్షకు హాజరవగా, 11,358 మంది (69.84 శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు. జగిత్యాల జిల్లాలో 6,104 మంది పరీక్షకు హాజరుకాగా, 3439 మంది (56.34 శాతం) ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లా నుంచి 3,827 మంది పరీక్షకు హాజరుకాగా, 2,390 మంది (62.45 శాతం) ఉత్తీర్ణత సాధించారు. అలాగే, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 3,336 మంది పరీక్షకు హాజరుకాగా, 1,724 మంది (51.68 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

**రెండో సంవత్సరంలో**

ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కరీంనగర్ జిల్లాలో 13,922 మంది పరీక్షకు హాజరు కాగా, 10,276 మంది (73.81 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో 5,370 మంది పరీక్షకు హాజరు కాగా, 3,691 మంది (68.73 శాతం) ఉత్తీర్ణత నమోదు చేశారు. పెద్దపల్లిలో 3,797 మందికి 2,659 మంది (70.03) శాతం ఉత్తీర్ణత సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 3,302 మందికి 2,158 మంది (65.35 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ మొదటి సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలో 1,530 మంది పరీక్షకు హాజరుకాగా, 783 మంది ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో 969 మంది పరీక్షకు హాజరు కాగా, 451 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 1069 మంది పరీక్షకు హాజరు కాగా, 650 మంది ఉత్తీర్ణత సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 483 మంది పరీక్షకు హాజరు కాగా, 252 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలో 1265 మందిలో 816 ఉత్తీర్ణత సాధించారు. జగిత్యాలలో 803 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 529 మంది ఉత్తీర్ణత సాధించారు. పెద్దపల్లి జిల్లాలో 918 మంది విద్యార్థుల్లో 700 మంది ఉత్తీర్ణత సాధించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 368 మంది విద్యార్థులకు 280 మంది ఉత్తీర్ణత సాధించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు

## ఎస్వీజేసీ సత్తా

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 22 : ఇంటర్ ఫలితాల్లో కరీంనగర్ ఎస్వీజేసీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభకనబరిచి సత్తా చాటారని కళాశాలల కరెస్పాండ్ ఉట్కూరి మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో సీహెచ్ రాజశేఖర్ రెడ్డి 468, బీ వెన్నెల 466, బీ శ్రీ నిత్య 466, బీ హరిణి 465, ఎన్ అరుణ్ తేజ 464, కే సహస్ర 463, ఎస్‌కే తమన్న 463, జే సునీల్ 462, పీ సంజన 462, ఏ హర్షవర్ధన్ 462, బైపీసీ విభాగంలో పీ సహస్ర 437, డీ శివకుమార్ 437, డీ శ్రీనిధి యాదవ్ 435, ఎం స్పందన 434, అనికేత్ మిశ్రా 434, ఎల్ శ్రీవల్లి 432, బీ రుచిత 431, ఎన్ నిహారిక 430 మార్కులు సాధించారని చెప్పారు. అలాగే, సెకండియర్ బైపీసీలో ఈ దిలీప్ 994, జే పద్మారాణి 992, డీ స్ఫూర్తి 992, కే రోహిణి 989, ఈ హర్షిత 988, ఎంపీసీ విభాగంలో పీ లిఖిత 992, ఎం స్ఫూర్తి 992, ఎస్ రిషిక 991, టీ లిఖిత్ గౌడ్ 989, ఆర్ మేఘన 988, కే కార్తీక్ 988, ఎస్ లావణ్య 987, ఎం త్రినిజ 987, ఎస్ రక్షిత 987 మార్కులు సాధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కాంతాల రాంరెడ్డి, మేడ వెంకట వరప్రసాద్, డైరెక్టర్లు సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్ రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

## ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, ఏప్రిల్ 22 : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కరీంనగర్ జిల్లాలోని ఎస్ఆర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని ఎస్ఆర్ కళాశాలలో జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి ప్రత్యేకంగా అభినందించారు. సెకండియర్ ఎంపీసీ విభాగంలో 990 మార్కులకు పైన 41మంది విద్యార్థులు సాధించారని, బైపీసీలో నలుగురికి ర్యాంకులు వచ్చాయని తెలిపారు. అలాగే ఫస్టియర్‌లో ఎంపీసీ విభాగంలో 465 మార్కులకు పైగా 63 మంది విద్యార్థులు, బైపీసీలో 435 మార్కులకు పైన ముగ్గురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని చెప్పారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ వరదా రెడ్డి, డైరెక్టర్లు మధుకర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, డీజీఎం వాసుదేవ రెడ్డి, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అభినందించారు.

# రెగ్యులరైజ్ చేయాల్సిందే

శాతవాహన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమ్మె

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 22: సింగిల్ సెటిల్మెంట్‌గా తమను రెగ్యులరైజ్ చేయాలని శాతవాహన కాంట్రాక్ట్, పార్ట్‌టైం సహాయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం లేదంటూ విశ్వవిద్యాలయ ఆవరణలో మంగళవారం సమ్మెలోకి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో రెండు దశాబ్దాలుగా కాంట్రాక్ట్, పార్ట్ టైం పద్ధతిలో సుమారు 1200 మంది చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామని చెప్పారు. నాణ్యమైన విద్యను అందిస్తూ విశ్వవిద్యాలయాలను కాపాడుకుంటూ వచ్చామని చెప్పారు. ఇన్నేండ్ల తమ కృషిని, కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం తమను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరవధిక సమ్మెలో గోదావరిఖని పీజీ కళాశాల, విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల, విశ్వవిద్యాలయ ఆర్ట్స్ సోషల్ సైన్సెస్, విశ్వవిద్యాలయం కామర్స్- బిజినెస్ మేనేజ్మెంట్, విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, పార్ట్ టైం సహాయ ఆచార్యులు సుమారు 39 మంది ఉన్నారు. నిరవధిక సమ్మెకు శాతవాహన విశ్వవిద్యాలయం విద్యార్థులు సంఘీభావం తెలుపగా, విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న రెగ్యులర్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది తమ మద్దతు తెలిపారు.



సమ్మెలో పాల్గొన్న సహాయ ఆచార్యులు

# 'ఈజీఎస్'ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర

తెలంగాణచౌక్, ఏప్రిల్ 22: గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, అందులో భాగంగానే కూలీ పని దినాలను తగ్గిస్తున్నదని బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కొయ్యడ సృజన్ కుమార్ ఆరోపించారు. నగరంలోని యూనియన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12కోట్ల పని దినాలు కల్పించాల్సి ఉండగా, 6.5 కోట్ల పని దినాలే కేటాయించారని మండిపడ్డారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పేద కూలీలు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఏటా బడ్జెట్‌లో ఈజీఎస్ నిధులకు కోతలు పెడుతుందని విమర్శించారు. కూలీలకు 200రోజుల పనిదినాలు, కూలి రూ.700 పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలనే కుట్రలను అడ్డుకోడానికి ఆందోళనలు చేపడుతామన్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on X @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

**టెండరు నోటీసు నెం.C/E.29/Elec/M/SC/08/PA/OT/2025-26 తేది: 21.04.2025**

దిగువ తెలిపిన పనుల కొరకు దిగువ సంతకందారు భారత రాష్ట్రపతి తరపున 12-05-2025న 15:00 గం. వరకు ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.: 01, ఇ-టెండర్ నెం.: ఇ-టెండర్ నెం.:C/E.29/Elec/M/ SC/08/PA/OT/2025-26, పని పేరు: సికింద్రాబాద్ డివిజన్ - ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ డిపార్ట్‌మెంట్ - SC డివిజన్ (ఫేజ్-II)లోని SC - BZA మరియు KZJ - BPQ సెక్షన్‌లో ABS స్టేషన్ల వద్ద ముఖభాగం మరియు స్టేషన్ లైటింగ్ యొక్క అభివృద్ధి - విద్యుత్ ఏర్పాట్లు. టెండర్ విలువ (రూ.): 12,13,61,071.00/- బయానా (రూ.): 7,56,800.00/-, CTF: 0.00, పూర్తి చేయు కాలం: 06 నెలలు.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, (M)/సికింద్రాబాద్.

**ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)**

దిగువ తెలిపిన పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.: 01, NIT No.: C/E.29/TRD/SC/15/2025-26, పని పేరు: టెండరు నెం.: C/E.29/TRD/SC/15/2025-26, తేది: 17-04-2025, SC డివిజన్ - BPQ KZJ సెక్షన్: BPQ - KZJ సెక్షన్‌లో ఆటో బ్లాక్ సిగ్నలింగ్ పనుల కోసం 25kV AT సరఫరా ఏర్పాటు - TRD అరేంజ్‌మెంట్లు. అంచనా వ్యయం (రూ.): 2,89,80,009.04/-, పూర్తి చేయు కాలం: 120 రోజులు, ముగింపు తేది: 14-05-2025న 15:00 గంటలు.

1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు వెబ్‌సైట్ http://ireps.gov.inకు లాగిన్ అవ్వండి.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర మరియు బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరుదారులందరూ కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందాల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయాల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు.
5) టెండరుదార్లు టెండరు దాఖలు కాలం ప్రారంభ తేదీ వరకు ఏదేని సవరణ (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది) కొరకు గమనించవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TRD/సికింద్రాబాద్

A0526

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి